## క్లుప్తంగా

### విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ పంపిణీ

కడప స్పోర్ట్స్: కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు కడప ఇంటలిజెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ హేమకుమార్ ఉచితంగా రైటింగ్ ప్యాడ్స్ అందజేశారు. ప్యాడ్, స్కేల్, పెన్, పెన్సిల్, పౌచ్ తదితర సామగ్రిని అందజేశారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ విద్యార్థులకు అందజేసి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషా మోహిద్దీన్ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి కోరారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ రాఘవరెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లుల మంజూరులో జాప్యం లేకుండా చూడాలన్నారు. పాస్‌పోర్టు, వీసాల నిరభ్యంతర అనుమతులను వెంటనే మంజూరు చేయాలన్నారు. 55 సంవత్సరాలు పైబడిన మహిళా ఉపాధ్యాయులను, దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, వికలాంగులకు పదవ తగరతి పరీక్షల ఇన్విజిలేషన్, మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాష, శ్రీనివాసులరెడ్డి, గురవయ్య, జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### ఉచిత శిక్షణ

కడప కార్పొరేషన్: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో సీసీటీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్ (13 రోజులు)లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎన్. నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులకు ఏప్రిల్ 3వ తేది నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 18–45 ఏళ్లలోపు వయసు కలిగిన నిరుద్యోగ యువకులు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు తిరుపతి రోడ్‌లో గర్ల్స్ ఐటీఐ పక్కనున్న తమ సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వివరాలకు 94409 05478, 63028 33546 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

### ఏప్రిల్ 5న ఛలో డిల్లీ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఏప్రిల్ 5న రవాణా రంగ పరిరక్షణ కోసం ఛలో డిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయిన రవాణా రంగం ప్రజలకు సరుకులను రవాణా చేస్తూ ప్రజల అవసరాలు తీరుస్తోందన్నారు. రవాణా రంగంలోని డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్‌ఐ, ప్రమాద బీమా, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### సీఆర్‌పీల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: సమగ్రశిక్షలో సీఆర్‌పీగా పని చేస్తున్న మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని సీఆర్‌పీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ ఆదిమూలం శంకర్ కోరారు. రామచంద్రారెడ్డిని శుక్రవారం జిల్లా సీఆర్పీల సంఘం తరుపున కడపలోని ఆయన కార్యాలయంలో కలిసి సీఆర్‌పీల సమస్యలు విన్నవించారు. సంబంధిత సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

### అధికారులపై చర్యలు తీసుకోవాలని వినతి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: స్పందన ఫిర్యాదులపై స్పందించని అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష పార్టీల నాయకులు సత్తార్, కెసీ బాదుల్లా, రామ్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు కలెక్టర్ విజయరామరాజుకు అఖిలపక్ష పార్టీల నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ ఆక్రమణల గురించి ఫిర్యాదు చేస్తే విచారణ జరిపిన కింది స్థాయి అధికారులు తప్పుడు నివేదికలు ఇచ్చారన్నారు. వీటిపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

### రాహుల్ గాంధీపై కక్ష గట్టడం తగదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని విశ్వేశ్వరయ్య సర్కిల్‌లో రాహుల్ గాంధీపై అక్రమ కేసులకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవాలు మాట్లాడిన రాహుల్ గాంధీపై కేసులు బనాయించిందన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో గంటల తరబడి ఈడీ విచారణ చేయించినప్పుడే ప్రజలకు బీజేపీ నిజస్వరూపం బయటపడిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విష్ణుప్రీతం రెడ్డి, బండి జకరయ్య, సత్తార్, కోటపాటి లక్ష్మయ్య, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

# క్షయవ్యాధిపై అప్రమత్తత అవసరం

కడప ఎడ్యుకేషన్: కరోనా అనంతరం టీబీ వ్యాధి పలువురిలో పెరుగుతోందని, దాని నియంత్రణకు అవగాహన, అప్రమత్తత చాలా అవసరం అని ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ ఫరూక్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐఎంఏ ప్రచురించిన క్షయ వ్యాధి లక్షణాలు తెలియచేసే వాల్‌పోస్టర్లను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి విడుదల చేశారు. అనంతరం క్షయ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ వినయ్ కుమార్, ఏఆర్‌టీ సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గురవయ్య పాల్గొన్నారు.

వైవీయూ : క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పురుషుల కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ యూనిట్ల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆయా కళాశాలల నుంచి బయలుదేరిన విద్యార్థులు యర్రముక్కపల్లిలోని సైనిక్‌సర్కిల్ వద్ద క్షయవ్యాధి నిర్మూలన సందేశాత్మక నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి క్షయవ్యాధి నివారణకు కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డా. జి. విజయలక్ష్మిదేవి, గురుమోహన్‌రెడ్డి, డా. వై. సావిత్రి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని ఫాతిమా మెడికల్ కళాశాల మెడికల్ సూపరింటెండెంట్ ఓబులేశు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామమనోహర్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రూకవానిపల్లె మండల ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బెనజీర్, మెడికల్ సోషల్ వర్కర్ సుబ్రమణ్యం, ఫిజికల్ డైరెక్టర్ సిరాజుద్దీన్, డాక్టర్స్, సిబ్బంది పాల్గొన్నారు.


సైనిక్ సర్కిల్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు


క్షయ వ్యాధి పోస్టర్లను విడుదల చేస్తున్న ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు ఫరూక్, వినయ్‌కుమార్



క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థినులు

# పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

– ఐసీడీఎస్ పీడీ ఎంఎస్ రాణి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీ కేంద్రాల్లో అందించే వైఎస్సార్ కిట్స్‌ను గర్భవతులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఎంఎస్ రాణి తెలిపారు. శుక్రవారం ఐసీడీఎస్ కడప అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని రూకవారిపల్లె అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్‌లో భాగంగా గర్భవతులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు. ఎంఎస్ రాణి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారాన్ని ఇస్తున్నామని, ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు అందజేస్తామన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలకు అనుబంధ ఆహారాన్ని ఏడవ నెల నుంచి మొదలు పెట్టాలని, అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతాన్ని పిల్లలకు తినిపించాలన్నారు. పిల్లల పెరుగుదల రెండు సంవత్సరాల్లోపు ఎక్కువగా ఉంటుందని, అందుకు తగిన విధంగా పిల్లలకు ఆహారం అందించాలన్నారు. చిరుధాన్యాలను అందరూ వినియోగించాలని తల్లులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో అర్బన్ సీడీపీఓ సునంద, ఎంఎస్‌కే రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మిదేవి, రేణుక, ఏఎన్‌ఎంలు లక్ష్మినరసమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ఎంఎస్ రాణి

# దైవారాధనకు సంగీతం ఓ మార్గం

కడప కల్చరల్ : దైవారాధన చేసేందుకు సంగీతాన్ని ఆశ్రయించడం అన్ని మతాలలోనూ అన్ని దేశాలలోనూ ఉందని రిటైర్డ్ ఇంజనీరు డి.వెంకటరెడ్డి అన్నారు. కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో ఉగాది నుంచి శ్రీరామ నవమి వరకు నిర్వహిస్తున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు శుక్రవారం శ్రీరామునిపై పాటల పోటీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ వెంకటరెడ్డి తొలుత శ్రీ సీతారామ లక్ష్మణుల ఉత్సవ మూర్తులవద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయంలో బాలలు, పెద్దల కళా ప్రతిభను, జ్ఞానాన్ని ముఖ్యంగా భారతీయ పురాణాలు, ఇతిహాసాల పట్ల కనీస పరిజ్ఞానం ఉండేలా చూసేందుకు పలు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా శ్రీరామునిపై సినీ ప్రైవేటు పాటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీకి దాదాపు 25 మంది గాయకులు హాజరు కావడం, అందులో మహిళలు కూడా ఉండడం సంతోషాన్ని ఇస్తోందన్నారు. ఉదయం పెద్దలకు రామయణంలోని అంశాలపై ధారణ పోటీ నిర్వహించారు. దాదాపు 50 మందికి పైగా ఉత్సాహంగా ఈ పోటీలో పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు శ్రీరామ నవమి నాడు జరగనున్న శ్రీ సీతారామ కల్యాణోత్సవంలో బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.


భక్తి గీతాలాపన చేస్తున్న గాయకులు

# పోలీసు కుటుంబానికి ఆర్థిక సాయం

కడప అర్బన్: జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఆర్ ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఎక్కల దేవీ ప్రసాద్ కుటుంబానికి జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ రూ. 2లక్షల ఆర్థిక సాయాన్ని, రూ. 25వేల ఫ్లాగ్ ఫండ్ మొత్తాన్ని చెక్కు రూపంలో శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ చెక్కును ఏఆర్ ఎస్‌ఐ సతీమణి లెక్కల దేవిప్రకాశమ్మకు ఇచ్చారు. అనారోగ్యంతో మరణించిన హోంగార్డు జి. నందకిషోర్ (హెచ్‌జి 796) సతీమణి జి. కృష్ణకుమారికి రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఏఓ ఎస్. జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ మహజబీన్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం చెక్కులను అందజేస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

# ఆలయాలను పరిరక్షించుకుందాం

చిట్వేలి : మట్లిరాజుల కాలంలో నిర్మితమైన పురాతన ఆలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని దేవాదాయశాఖ అధికారి విశ్వనాథం పేర్కొన్నారు. శుక్రవారం శ్రీ శ్యామలాంబ సమేత సోమేస్వరస్వామి, శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి, వరదరాజస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలను స్థానికులతో కలిసి దేవాదాయశాఖ అధికారి విశ్వనాథం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల భూములు, ఆక్రమణలపై తహసీల్దార్‌తో కలిసి సర్వే చేయించి విచారణ జరిపిస్తామన్నారు. భూములు కౌలు సమయం ముగియడంతో దండోరా వేయించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సతీష్ శర్మ, అరవింద శర్మ, మణికంఠ, పాత చిట్వేలి యువత పాల్గొన్నారు.


ఆలయ భూముల ఆక్రమణలను పరిశీలిస్తున్న అధికారులు

### శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

గోపవరం : మండలంలోని రాచాయపేట గ్రామంలో కొలువైన శ్రీకోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట చేశారు. ముందుగా గణపతి హోమం నిర్వహించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో హోమంలో పాల్గొని ధ్వజస్తంభ ప్రతిష్ఠను తిలకించారు. అనంతరం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించి రాత్రి సీతారామ సమేతంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. బద్వేలు రూరల్ ఎస్‌ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

### చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రం ప్రారంభంలో వైద్యాధికారులు, సిబ్బంది

కడప అర్బన్: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో ఐపీ విభాగం ఎదురుగా చలివేంద్రంను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ ఆర్‌ఎంఓ డాక్టర్ వై. శ్రీనివాసులు, డిప్యూటీ ఆర్‌ఎంఓలు డాక్టర్ ఎస్ఆర్ రాజేశ్వరి, ఇతర వైద్యులతో పాటు, రిమ్స్ శానిటేషన్, సెక్యూరిటీ విభాగం కాంట్రాక్టర్ జె. బాలనారాయణ రెడ్డి, సూపర్‌వైజర్ సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

### ట్రాఫిక్ రూల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

కమలాపురం : డ్రైవింగ్ నేర్చుకునే వారు ట్రాఫిక్ రూల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని కడప ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక లక్ష్మీదుర్గా టెక్నికల్ డ్రైవింగ్ స్కూల్‌లో నిరుద్యోగ యువతకు సీడ్ ఆర్థిక సాయంతో అభయ ఫౌండేషన్, మదర్ థెరిసా సేవాసమితి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత డ్రైవింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉపాధి చూపించాలని దాతలు ముందుకు వచ్చి డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వడం హర్షణీయం అన్నారు. ఎల్ఎల్ఆర్ అనేది పర్మనెంట్ కాదని, తాత్కాలికమన్నారు. ముఖ్యంగా డ్రైవింగ్ నేర్చుకుంటున్న యువకులు ట్రాఫిక్ రూల్స్‌పై దృష్టి సారించాలన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ పొందడం కూడా సులభం అవుతుందన్నారు. మదర్ థెరిసా సేవాసమితి ట్రస్ట్ చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 15 మంది యువకులకు ఎల్ఎల్ఆర్ అందాయన్నారు. మరోనెల రోజుల్లో డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డ్రైవింగ్ స్కూల్ అధినేత సుబ్బరాజు, డ్రైవింగ్ శిక్షణ పొందుతున్న యువకులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ఆర్థికసాయం

– ఒక్కొక్కరికి రూ.50వేలు అందజేసిన వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి

సిద్దవటం : ప్రమాదంలో గాయపడిన వారికి మండల వైస్ ఎంపీపీ శ్రీనివాసులరెడ్డి ఆర్థికసాయం చేసి బాధిత కుటుంబసభ్యులకు అండగా నిలిచారు. వివరాలు ఈ నెల 21న మండలంలోని జంగాపల్లె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాలెం లక్ష్మమ్మ, కోటపాటి ఓబులమ్మలను శుక్రవారం కడపలోని వేరువేరు ప్రైవేటు ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్న వారిని కలిసి పరామర్శించారు. అనంతరం వారివారి కుటుంబసభ్యులకు రూ. 50 వేలు అందజేశారు. కార్యక్రమంలో బొగ్గిడివారిపల్లె ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ జి.ఎల్లారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ క్రిష్ణచైతన్య, నిమ్మకాయల ప్రసాద్ రెడ్డి, రామిరెడ్డి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

### జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

పెండ్లిమర్రి : సబ్ జూనియర్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పెండ్లిమర్రి మండలం నందిమండలం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన బి.సాయి కిరణ్, సి.ఆదిశేషారెడ్డిలు ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్‌ఎం కళావతి, పీడీ రాజశేఖర్‌లు శుక్రవారం తెలిపారు. ఈపోటీలు ఈనెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో జరుగుతాయన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, పీడీలు జ్ఞాపికలు అందించి సత్కరించారు. అలాగే స్కూల్ కమిటీ చైర్మన్ శివశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

## అమ్మవారికి రాహుకాల పూజలు





రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం వీరభద్రస్వామి ఆలయ పాలకమండలి అధ్యక్షుడు పాలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు అమ్మవారికి రాహుకాల పూజలు జరిపారు. అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి, రంగురంగుల పూలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు.

## వైభవంగా సిరిమాను ఉత్సవం

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలంలోని వద్దిరాల గ్రామంలో సుంకులమ్మ తల్లి తిరునాల సందర్భంగా శుక్రవారం సిరిమాను ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన బండలాగుడు పోటీలను ప్రారంభించారు. కర్నూల్, అనంతపురం గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. పెద్దకోట్లాలకు చెందిన ఎడ్లు మొదటి బహుమతి రూ. 80 వేలు, రెండవ బహుమతి రవీంద్రారెడ్డికి చెందిన ఎడ్లకు రూ.70 వేలు, 3వ బహుమతి పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎడ్లకు రూ.60 వేలు లభించింది. కార్యక్రమంలో అర్బన్ డెవలప్‌మెంట్ ఛైర్‌పర్సన్ వెంపలాకు లీలావతి, ఎంపీపీ చేరెడ్డి సావిత్రి, జడ్పీటీసీ మహలక్ష్మీ, సర్పంచ్ జయశ్రీ, మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

### ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


సర్టిఫికెట్లు, మెమెంటోలతో చిన్నారులు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని గురుకుల విద్యాపీఠ్‌లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డేని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా యూకేజీ, 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్‌తోపాటు మెడల్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెంకటేశ్వర్లు, పాఠశాల డైరెక్టర్ వీరకుమారి, హెచ్‌ఎం మునిచంద్ర పాల్గొన్నారు.

– కడప ఎన్‌జీవో కాలనీలోని గురుకుల విద్యాపీఠ్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పదవీ విరమణ తెలుగు ఉపాధ్యాయులు నాగప్రసాద్ హాజరై మాట్లాడారు.

### ఘనంగా కలశారాధన


ఊరేగింపులో స్వామి భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం పాత బస్టాండులోని శ్రీ సద్గురు అవధూతేంద్రస్వామి జ్ఞాన మందిరం 45వ ఆరాధన ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ చైర్మన్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో అగ్నిమాపకశాఖ కార్యాలయం వద్దగల తులసి కోట వద్ద నుంచి ఊరేగింపు నిర్వహించారు. భక్తుడు రాజా కలశాన్ని ధరించి ఊరేగింపుగా ఏడురోడ్ల మీదుగా అవధూతేంద్ర స్వామి జ్ఞానమందిరానికి చేరుకున్నారు. ఊరేగింపు భక్తులకు పోతుల వెంకట్రామిరెడ్డి పాత బస్టాండులోని తమ కార్యాలయం వద్ద ఘనంగా ఆహ్వానం పలికి సత్కరించారు. అనంతరం ఆలయంలో స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని పల్లకీపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాజగోపాల్ బృందం అన్నమయ్య కీర్తనలు ఆలపించగా, వై.రమేష్ భాగవతార్ హరికథా గానం చేశారు.

### గ్రేడ్-2 వీఆర్వోల ప్రొబేషన్ డిక్లేర్ చేయాలి


కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న గ్రేడ్-2 వీఆర్వోల సంఘ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం పరీక్షల్లో ఉత్తీర్ణులైన వీఆర్వోలను గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారులుగా ప్రొబెషన్ డిక్లేర్ చేయాలని పలువురు గ్రేడ్-2 వీఆర్వోలు కోరారు. ఈ మేరకు వారు జిల్లా కలెక్టర్ విజయరామరాజును కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలు అయిన నెల్లూరు, గుంటూరు, ఈస్ట్ గోదావరి జిల్లాల వారికి ప్రొబెషన్ డిక్లేర్ చేశారన్నారు. ఈ సమావేశంలో వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షులు రామగంగాధర్‌రెడ్డి యాదవ్, ప్రధాన కార్యదర్శి దేవానంద కుమార్, గౌరవాధ్యక్షులు నాని, వీఆర్వోలు పాల్గొన్నారు.

### వైభవంగా మాతృపూజ


తల్లుల పాదాలు కడిగి గౌరవాన్ని చాటుకున్న చిన్నారులు

కడప కల్చరల్ : సమాజంలో తల్లికిగల గౌరవం మరెవరికీ లభించదని, అలాంటి వారిని గౌరవించి ఆశీస్సులు పొందడం శ్రేయస్కరమని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కడప నగరం బళ్లారి రోడ్డులోని నజీముల్ అమీన్ పబ్లిక్ స్కూలులో విద్యార్థులు మాతృపూజ నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థుల తల్లులందరినీ పాఠశాలకు ఆహ్వానించారు. అనంతరం విద్యార్థులు వారి తల్లికి పాదాలు కడిగి వారి పట్ల తమకుగల గౌరవాభిమానాలను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాదర్‌బాష, స్పెషల్ ఆఫీసర్ రజియా, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

### వేడుకగా కల్యాణోత్సవం

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె గ్రామం చిత్తూరు– కర్నూలు జాతీయ రహదారి పక్కన కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని జరిపారు. మూలవిరాట్‌లకు అర్చన అభిషేక తదితర పూజా క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు.